# చావూ పుట్టుకల మధ్య

"జనన మరణాల మధ్య మన జీవితం లేదురా కొండా? మనమనుకుంటామలా అంతే... నిజానికి మనకి రెండూ తెలీవు. మన పుట్టుక మనకి తెలీదు. అలాగే మన మరణమూ మనకి తెలీదు. రెండు చీకటి బిందువుల్ని ఓ వెలుతురు గీతతో కలపడమంత అవివేకమింకోటుండదేమో కదా....! నిజానికి జ్ఞానం నించీ ఇంకో జ్ఞానబిందువు వరకూ సాగడమే మన నిజమైన జీవితమేమో....?!

నిజం చెప్పు..... నిర్దిష్టంగా నా జీవితమిక్కడా.. ఇక్కడ మొదలైందీ అని నువ్వు చెప్పగలవా?..... అట్లా ఎవరేనా చెప్పగలరా అసలు...?

... కానీ మన జ్ఞాన బిందువుని మాత్రం స్ఫుటంగా ఇదిగో ఇక్కడుందీ అని చూపించగలం...

... ఆ స్పష్టం బిందువునించీ మొదలై ఇంకో నిర్వేద జ్ఞానబిందువు దగ్గర మన జీవిత రేఖ ఆగిపోతుంది. కాదంటావా?...

అస్పష్టంగా.. అర్థం అయ్యీ, కాకుండా ఉంది కదూ....?

నిజమే. కానీ కాస్త ఆలోచనల్ని స్థిరం చేసి కదల్చకుండా నిలిపి, చూస్తే అర్థం కాదంటావా?

సరిగ్గా ఆ ప్రమాణంతో కొలిస్తే మనందరి జీవితాలూ ఎంత కురచగా కనిపిస్తాయిరా..!

ఆఁ...!!

మనందరి జీవితాలు కొన్ని రోజులంత కూడా లెక్కతేలవు. ఛీ... అల్పులంరా మనం.. అతి అల్పులం...

నా కరవైయ్యేళ్లూ.. నీకు అరవైమూడేళ్లూ అన్చెప్పుకోడమేగానీ.. కనీసం ఓ యేడాది జీవితం కూడా లేని నికృష్టమానవులంరా మనం.. ఛీఁ...ఛి...ఛి...ఛీఁ...."

'హుఁ' అని దీర్ఘంగా నిట్టూర్చి శుబ్బరంగా డై చేసిన మీసాలనితడుముకుంటూ, 'అయితే ఈ రోజున మనం తోటకెళ్లాల్సిందే... మన ప్రసాదం, కృష్ణుడూ వస్తామన్చె

ప్పారు.. రమ్మనేదా వద్దా......? అన్నాడు కొండా అన్నేను పిలిచే కొండారెడ్డి.

రానీ.... రానీ... వాళ్ల మాత్రం మనశ్శాంతితో యెందుకు నిద్రపోవాలీ ఈ రాత్రి... నేనొక్కడినే నీకు ఖర్చు కావాలా... రానీ... రానీ...'' అని మళ్ళీ తనే అని గట్టిగా నవ్వాడు.

''నవ్వులాట కాదురా కొండా! నా మనస్సేమీ బాగాలేదు...'' సీరియస్గా అన్నాను.

ఆ మాటపైకి అన్నా లోపల్లోపల నాకు తెల్సు మా కొండారెడ్డి బావ గొప్ప యోగి.. భార్యను దహనం చేస్తూ కూడా శ్మశానంలో జోకులేసి అందరి కన్నీళ్లనీ తాగేసినవాడు.

నిటారుగా ఠీవిగా నడుస్తాడు. రాత్రి ఓ రౌండు ఎక్కువైనా, తెల్లారి అయిదున్నరకే లేస్తాడు.యేగాసనాలేసి గజగజా వణికించే చలిలో అయినా సరే చన్నీళ్ళ స్నానం చేస్తాడు. తనన్నాను అగ్నాస్టిక్ననని చెప్పుకుంటాడు. చెల్లిని నాకిచ్చిన పాపానికి గాక నన్ను నన్నుగా , స్నేహితుడిగా, అమాయకుడిగా, కుర్రవాణ్ని చేసి.... శిష్యుడినీ చేసి ఒక్కోసారి గురువున్చేసి కూడా... చూస్తాడీ కొండారెడ్డి.

నన్నోసారి నిశితంగా చూసి ఫోనందుకుని డయల్ చేశాడు.

నాక్తెల్సు....ఆ ఫోను నా ఇంటికేనని...!

ఓ క్షణాల మడతని కాలం తనలో కలుపుకున్న తర్వాత,

''లో.. నేనే భద్రం...! కొండణ్ని... యేమిటీ మీ ఆయనకీరోజు యేం వండి పెట్టావు.. గోరు చిక్కుడుకాయ పైత్యం చేస్తుందని తెల్సుకదే... మీ ఆయనకింకా యెక్కువది... వాడికస్సలు పడదు.. నా దగ్గరకొచ్చి యేమేమో వాగుతూ... అఁ...? అహఁ... ఓహోఁ ... అదా... అస్సల్సంగతీ.. సరేలే... వాడు రాత్రింటికి రాడు... తోటకెళ్తున్నాం... మీ వదిన్చేతిబోయనం లేకుండానే తోటలో గడపడం ఇదే మొదలే భద్రం..... అందుకని సూరిగాడిని జీపిచ్చి పంపుతా... నలుగుర్కి భోయనాల్పంపు... అమ్మ చచ్చింతర్వాత నన్ను మేసింది నువ్వే కాదుటే... సర్సరి... వాడు నా దగ్గిరున్నాడన్న సంగతి మర్చిపోకు... మరీ....? అది లేకుంటే యెలాగే పిచ్చిమొద్దూ... లేదులే నీ మొగుణ్ణి జాగర్తగా చూసేపూచీ నాదీ...సరేనా...?'' అని ఫోన్పెట్టేసాడు.

నా వేపు తిరిగి.. ''వోఁ.. అయితే మాధవం కొడుకు చచ్చిపోయాడన్న మాట. ఆ మాట తిన్నగా యేడవచ్చు గదా? జీవితాలూ, కొలతలూ, పొడుగూ, నిడివీ అని సర్రియలిస్టిగ్గా మాట్లాడ్తావు...'' అన్నాడు.

''అది కాదురా కొండా? నే...''

''ఇంకేమీ ఇక్కడ మాట్లాడకు... తోటకెళ్లి మాటాడుకుందాం. చిన్నాడు పోయిన్నారి వ్యాంకూవర్నించీ వచ్చినప్పుడు తెచ్చిన టెక్విలా రెండుకాయిలూ తలల్తెగక తల్లడిల్లిపోతున్నాయి.... భద్రం కమ్మగా వండి తిండి సంపుతానన్చెప్పింది. నేను డ్రెస్చేసుకునేలోపల ప్రసాదానికి కృష్ణుడికీ ఫోన్చేసి డైరెక్టగా తోటకి రమ్మన్చెప్పు'' నాకు మాట్లాడే అవకాశమివ్వకుండా లేచెళ్ళిపోయాడు కొండారెడ్డి...

✦ ✦ ✦

పదిహేనెకరాల మామిడితోట. టర్నింగ్‌లోనే కనబడింది ప్రసాదం.

ఫియట్. ప్రసాదం, కృష్ణుడూ ఇద్దరూ ఏవన్ కాంట్రాక్టర్లే.

మా కొండడు పంచాయతీరాజ్ ఇంజనీర్గా ఉన్నప్పటి పరిచయాలు. అట్లా అట్లా కలిసి "ఏరా ఏరా" అనుకునేవరకూ పెరిగి దాదాపు పాతికేళ్ళ వయస్సొచ్చేసింది మా స్నేహానికి.

కృష్ణుడు అప్పటికే తాన్తెచ్చిన సీసా ఓపన్చేసేసాడు.

"చాల్రోజులైందిరా రెడ్డీ..... తోటలో కూచుని. యేమిటి విశేషం?" ప్రసాదం అడిగాడు.

"మీ జీవితాల పొడుగెంత... అడ్డమెంత.. లోతెంత... అని ఈ రాత్రికి రాత్రి కొలతేయించడమే ఈ రోజు విశేషం" అని గట్టిగా నవ్వాడు కొండారెడ్డి.

నాక్కూడా నవ్వొచ్చింది. కానీ మళ్ళీ మాధవం కొడుకు శవం గుర్తుకొచ్చి మ్లానమైంది మనసు.

"వీడు పాడెమీద పడుకుని కూడా జోకులేస్తాడు. వీడితో వేగడం కష్టాల్లోకే కష్టం" అన్నాడు కృష్ణుడు.

"మాధవం కొడుకు చచ్చిపోయాడ్రా. నిజానికి వాడికి మరణమంటే యేమిటో తెలీదసలు. పుట్టినప్పటినించీ ఈ రోజున చనిపోయేవరకూ వాడికి లోకం తెలీదు. శూన్యం నిండిన చూపుల్తో లోకాన్ని చూడ్డం... మలమూత్రాలు పక్కనే అన్నం తింటం కూడా తెలీదు... మాధవుడికి డబ్బు గురించి బెంగలేదు కాబట్టి వాడికి చాకిరీ చేయించాడిన్నేళ్లూ... ఆ జ్ఞాన శూన్యుడికి జీవితమనేదుందా.....? వాడుజీవించీ... చనిపోయినవాడికిందే లెక్క. ఈ రోజున వాడుచనిపోయినా పెద్దగా తేడా లేదు... ఆ పిచ్చివాడి శవాన్ని చూసి, ఉదయాన్న నన్ను నేను.. ప్రశ్నించుకున్నారా...యేమిటిది? అసలు జీవితమెందుకు? యెట్లా....? మనజీవితాల అర్థం పరమార్థం యేమిటని? వాడికీ మనకీ పెద్ద తేడా లేదనిపించిందో క్షణం... వున్నా కొద్దిపాటి తేడా అల్లా ప్రాకృతికవసరాలకి మనం ఇంకోళ్ళమీద ఆదారపడిలేమంతే.. అని.. మన కాలమానం ప్రకారం ఆ పిచ్చి వెధవకి పంతొమ్మిదేళ్ళు. నిజానికి వాడి వయసెంత... వాడికా స్పృహ లేదే... అసలువాడు పుట్టాడా...? ఈ రోజున మరణించాడా....? అన్నవింత ప్రశ్నలు పుట్టాయి నాకు... అదే వీడితో అన్నా... సరే ..నల్గురం కూచుని చాల్రోజులైంది. మీ యిద్దరితోటీ కూడా మాట్లడదాం అని ఇలా అన్నమాట..." ఊపిరి పీల్చుకుంటూ అన్నాన్నేను.

"ఇట్స్ గోయింగ్ టు బీ అ వెరీ హెవీ నైట్ దెన్" దీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు ప్రసాదం.

"కృష్ణుడూ! ఆ బాటిల్ పక్కకు పెట్టెయ్యి.. లెట్స్‌గో మెక్సికన్ టు నైట్..." అంటూ టెక్విలా సీసాలు టీపాయ్ మీద పెట్టాడు కొండడు.

"యేమిట్రా ఇదీ?" అని సీసా పైకెత్తి అద్దాల్లోంచి చూస్తూ సీసా మీద ప్రింట్

చదవడానికి ప్రయత్నించాడు కృష్ణుడు.

"కలబందసారాయి... అయితే అమెరికానించొచ్చింది. మా చిన్నాడు పోయిన్నారొచ్చి నరపుడు తెచ్చాడ్లే... అవునూ మీరొచ్చియెంతసేపయిందిరా.. టీపాయ్ కుర్చీలూ అన్నీ బాగా సెట్ చేసుకున్నారూ... మా సూరిగాడెక్కడా..?" అన్నాడుకొండారెడ్డి బావ.

"మేం వచ్చినపుడున్నాడు.... ఆ అమ్మాయికి నిండా నెలల్లాగాఉంది... మాకన్నీ సర్దించేసి... మోపడ్లో ఆ అమ్మాయిని డాక్టర్దగ్గర్కి తీసికెళ్లాడు... వచ్చేస్తానన్నాడు ఓ గంటలో..." చెప్పాడు ప్రసాదం.

"అవునవును... దానికి తొలిచూలు...పాపం.. చూసేవాళ్లెవరూ లేరు.. మా అవిడ బ్రతికుంటే, ఇంట్లోనే ఉంచుకునేవాణ్ణి... అక్కడికి నర్సింగ్ హోంలో చేర్చరా వెధవా అన్నాను. 'కానుపయే సమయానికి చేరుస్తాలే నాన్నా' అన్నాడు అయినా ఇక్కడ ఊరికి బాగా దూరం కాదూ! ఇట్స్ సిక్స్‌టీన్ కిలోమీటర్స్ ఫ్రం హియర్."

సూరిగాడనబడే సూర్యం, ఓ అనాథని చెప్పేవరకూ ఎవ్వరికీ తెలీదు. మా కొండడే వాణ్ణిచేరదీసి, చదివించి, పిడబ్ల్యూడీలో ఉజ్జోగం వేయించి/పెళ్లి చేసి, ఈ తోటలో ఇంటిని వాడికిచ్చేసాడు. వాడు "నాన్నా! నాన్నా!' అంటూ ప్రాణం పెడ్తాడు.. కొండ డంటే.. ఆ అమ్మాయిక్కూడా... వాళ్లిద్దర్కి వీడు నడిచే దేవుడు.

అంతట్లోనే ...మెయిన్‌గేట్‌లోంచి వెల్తురు కనిపించింది. వచ్చింది సూరీ..... వాడి భార్యా...స్టాండ్ వేసి వచ్చాడు సూరి దగ్గిరగా.

"ఏరా యేమంటోంది డాక్టరమ్మ...? జాయిన్ చేసేయలేకపోయానా. దాన్ని యీ మాదిరిగా ఇబ్బంది పెట్టడం బాలే... అదా ఒక్కత్తే.... ఇక్కడా ఆడదిక్కులేదు.. మృదువుగా విసుక్కున్నాడు కొండడు.

"లేదు... నాన్నా! ఇంకా వారం రోజులవుతుందని చెప్పింది డాక్టర్.. రేపు సాయంకాలం తీసికెళ్ళి నర్సింగ్‌హోమ్‌లో చేరిపించేస్తా..." నంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టు అన్నాడు వాడు.

ఆ అమ్మాయి కూడా మెల్లిగా నడుచుకుంటూ వచ్చి, కొండడి పక్క నిలబడింది.

"యేమ్మా రుక్కూ! ఇబ్బందిగా ఉందా?

ఆపేక్షంతా తానై అన్నాడుబావ.

లేదు నాన్నా. మీరుండగా మాకే ఇబ్బందీ ఉండదు కల్మషం లేకుండా అందా అమ్మాయి.

"వరేయ్ సూరీ? అత్తయ్య వాళ్లింటికెళ్లి కారెజీలు పట్టుకు రావల్రా.. జీపు తీసుకెళ్లు రాత్తిరి నేనూ మామయ్యా ఇక్కడే పడుకుంటాం... పక్కలు కూడా వేయించు. పెద్దిగాడూ వాడి కొడుకూ కనబడ్డేం...?" అన్నాడు కొండారెడ్డి.

"వెనకాల నర్సరీ కంచెలోంచీ పందులొస్తున్నాయి నాన్నా. అందుకనక్కడే నెగడేసుక్కూచున్నారిద్దరూ. వస్తార్లే... నేవెళ్ళి అరగంటలో వచ్చేస్తా... ఇంకేమైనా కావాలా నాన్నా... ఊళ్లోంచీ..." అడితగాడు సూరి. యేదో చెప్పబోయి...

"యేం అక్కర్లా, వచ్చేయ్ త్వరగా..." అన్నాడు బావ.

సూరి వెళ్లిపోయింతర్వాత మళ్లీ తోటలో నిశ్శబ్దమావరించింది.

"సో... మాధవరావు పిచ్చికొడుకు చనిపోయాడన్నమాట... మంచిదే గదా.. వాడు బ్రతికి యెవ్వర్నీ ఉద్ధరించేదీ లేదు... వాడికి వాడే భారం.... దానికి నువ్వంతగా తన్నుకు చచ్చే అవసరం లేదు.. వాడి చావుకీ... మన్జీవితాలకీ లంకె వేయడం, మోకాలికీ బోడిగుండుకు ముడివేయడం లాంటిదే.." సిగరెట్ వెలిగించుకుని అన్నాడు కృష్ణుడు.

"నేనన్నది అదికాదురా కృష్ణుడూ...! అసలు వాడికి జీవితమంటూ ఓటుందా?.. వాడీ పంతొమ్మిదేళ్లూ జీవించాడంటావా...?" అన్నాను.

"యస్... నువ్వు రైట్.... వాడు జీవించలేదు. పంతొమ్మిదేళ్లు. అదే మన కాలమాన ప్రకారం బ్రతికున్నాడు అనొచ్చు" అన్నాడు కొండారెడ్డి.

"అలాంటప్పుడు వట్టినే బ్రతికుండడం జీవించడం కాదు కదా....?! మనం బ్రతికుంటేనే యెంత జీవించామని... మన జీవితమెంతా... అనీ నా ప్రశ్న..." వాళ్ళ ముగ్గుర్నీ ఓ సంతృప్తికరమైన ప్రశ్న దగ్గరికి తీసుకువచ్చిన రిలీఫ్‌తో అన్నాను.

"హాఁ.....యస్...! దట్ సట్ల్ నూవాన్స్ ఈజ్దేరినిట్! ప్రసాదం తలపంకిస్తూ అన్నాడు.

"నిజమే. వీడన్నట్టు మనం బ్రతికుంటూ జీవించే క్షణాలు యేకొన్నో...! అయితే ఇక్కడ మనం ఈ బ్రతుకులో ఎప్పుడు జీవిస్తామో మనకే తెలీదు. కొన్ని అద్భుత క్షనాలు.. సడన్‌గా ప్రత్యక్షమవుతాయి.. ఆ కొద్ది క్షణాల జీవితపు పరిమళంలో మనం మళ్లీ ముందుకు సాగిపోతాం... అయితే ఇక్కడ నే చెప్పదలచుకున్నదేమిటంటే... బ్రతుకు వైయక్తికం జీవితం సార్వజనీనం... యస్.... ఇట్స్ యూనివర్సల్...!" అన్నాడు కొండారెడ్డి.

ఇంతలో పెద్దిగాడూ, వాడి కొడుకూ వచ్చారు. పెద్దిగాడి కొడుకు భుజానికి ఓ మధ్య సైజు అడివిపంది వేల్లాడ్తోంది.

పెద్దిగాడు నోరంతా తెరిచి, నవ్వి, రేత్రీడే తొంగుంటున్నారా బాపూ... పందిని కాల్చీసుకు రమ్మంటారేమిటీ...?" అన్నాడు.

మేమొకరి మొఖాలొకరు చూసుకుంటూండగానే...

వెనకాల ఇంట్లోంచి సూరి భార్య రుక్మిణి గట్టిగా అరుచుకుటూ ఆయాసపడ్తూ బైటికొచ్చింది.

చెప్పకుండానే అక్కడున్న అందరికీ తెలిసిపోయింది. ఆ అమ్మాయి ప్రసవించ బోతోందని.

కొండారెడ్డి దిగ్గున లేచి ఆ అమ్మాయిని పట్టుకుని వరండాలో నేలమీదే పడుకో బెట్టాడు.

"నాన్నా... నాన్నా" అంటూ ఆయాసపడుతూ అరుస్తోందా అమ్మాయి.

ఎవ్వరికీ దిక్కుతోచని పరిస్థితి ఆ అమ్మాయి చీరంతా తడిసిపోతోంది. నాకూ

కాళ్లు చేతులూ చల్లగా అయిపోతున్నాయి.

హాస్పిటల్లో చేర్చరా వెధవా... అని ఆ అడ్డగాడిదకి చెప్పినా, వాడు వినలే... ఛీఁ ..." అసహాయంగా కొండారెడ్డి.

"కార్లో తీసుకెళ్దాం. నేను రివర్స్ చేసి కారిటు తీసుకొస్తా. యేమ్మా గాబరా పడకు... ఇక్కడ్నీకు నలుగురు నాన్నలున్నారు. యేం కాదు..." అని తను గాబరా పడ్తూ అన్నాడు ప్రసాదం.

రుక్మిణి తల అడ్డంగా ఆడిస్తూ చేతులెత్తి దండం పెట్టి మళ్ళీ కెవ్వుమని కేకేసింది.

"బాపూ.. మీరల్లాల్లాగా యెలిపొండి...యేటీ కాదు.. నానుసూసుకుంటను.. నాకొగ్గేసి మీరిటొచ్చీండి... వొరె సత్తిగా... ఆ పందినొగ్గేసిల్లాగొచ్చీ.. అమ్మాయిగోర్ని లోపలికంటా సాయంపట్టు..."

ఒకే ఒక క్షణంలో పరిస్థితిని తన అధీనంలోకి తీసుకున్నాడు పెద్దిగాడు. మిలటరీ కమాండర్లాగా...

రుక్మిణిని ఇంతకుముందు పడుకోబెట్టిన చోట రక్తమూ, ఉమ్మనీరు పడి అలుక్కుపోయింది.

లోపల రుక్మిణి అరుపులు బీభత్సంగా వినిపిస్తున్నాయి. పెద్దిగాడి సముదాయింపు మాటలు కూడా.

సూరి జీపులోంచి క్యారియర్లు తీస్తూ.. మమ్మల్ని నలుగుర్నీ, వరండాలో చూసీ,లోపలి అరుపులు వినీ, పరిస్థితి క్షణంలో అర్థం చేసుకున్నాడు... నోరు తెర్చుకుని మూసిన్తలుపులు దగ్గర అసహాయంగా నిలుచున్నాడు.

కొండారెడ్డి విసురుగా వెళ్ళి సూరి చెంప మీద చెళ్లున చరచి, "వెధవా హాస్పిటల్లో చేర్చరా.. అన్నీకు ఎన్నిసార్లు చెప్పారా. గాడిదా...గట్టిగా అరిచాడు.

సూర్యం తల దించుకుని గుడ్డల నీళ్లు కక్కుకుంటూ... ఇంకా వారం రోజుల వరకూ యేమీ కాదని డాక్టర్ చెప్పింది నాన్నా.. నాకు మాత్రం... ఓ అని యేడ్చేసాడా అబ్బాయి.

కొట్టిన చేత్తోటే వాడిని కావలించుకుని.. వాడి భుజం తడుతూ ఓదారుస్తూ అన్నాడు కొండడు. "ఇంతకీ డాక్టరెవ్వర్రా సూరీ..?"

"మహాలక్ష్మి యం.డి. నాన్నా!"

"యం.డీ ఇంటిపేరేమో... డిగ్రీ కాకపోయుండొచ్చు..." జోకేసాడు కొండడు.

నవ్వొచ్చినా, మళ్ళీ లోపలేం జరుగుతుందో నన్న ఉత్కంఠ.

మెట్ల దగ్గర నాలుక్కాళ్లూ కట్టేసిన అడివిపంది తన్నుకుంటూ అరుస్తోంది.

లోపల రుక్మిణి.

ఏడెనిమిది నిముషాల తర్వాత.... బైట అడివి పంది అరుపూ, రుక్మిణి కేకా...ఇంకో శైశవపు కేరింతా... మా అయిదుగురి నిట్టూర్పు... కలిసి ఒకేసారి శబ్దించాయి... ఆ చీకటి తోట నిశ్శబ్దంలో...

తలుపు తీసుకుని.. పెద్దిగాడు పళ్ళన్నీ బైట పెట్టి నవ్వుతూ.. "మగ బిడ్డండీ" అన్నాడు.

కొండడు వెళ్ళి వాణ్ణీ అమాంతం కావలించుకున్నాడు.

"అయ్ ఒగ్గిండీ బాపూ... ఒగ్గిండీ బాపూ..." అని పెద్దిగాడంటూండగానే.... కొండడు నావేపు తిరిగి

"వీడు.. ఈ పెద్దిగాడికి డెబ్భైయేళ్ళు..... వీడు డెబ్భైయేళ్ళు బ్రతికాడా...? డెబ్భైయేళ్ళ తర్వాత ఈ కొన్ని క్షణాలూ జీవించాడా... చెప్పరా... ఒరేయ్.. చెప్పరా...?" అనరిచాడు.

కళ్లు తడి తేరుతోంటే అందరం, హాయిగా నవ్వాం.

వరేయ్ సత్తిగా ఆ పందినొదిలేసి రారా అన్నాడు ప్రసాదం.

ఒక్కసారి స్పృహ కలిగింది.

అవునవును. జీవితం సార్వజనీనం. ఈ చైతన్యమే జీవితం.

లోపల గదిలో కడుగుపెట్టగానే వాసన.

ఆ పురుటి వాసనలో యేదో తెలీని పురాతనచైతన్యపరిమళం....!

నిజమే,జీవితం నాదొక్కడిదే కాదు.....?

యెప్పుడో.... యెక్కడో.... అనాదిలో పుట్టి..... అనంతంగా సాగుతున్న ఈ చైతన్య ప్రవాహమే జీవితం...!

పొద్దుటి విషాదపు తెర తొలగిపోయింది. ✦

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 29 జూన్ 1998)*